# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

AUGUST 1995

# ఏ కొత్త సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న "సత్యవాణి" అను రేడియో కార్యక్రమముల ద్వారా, మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను మరింపుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకము మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25**/- లు ఈ క్రింది అడ్రసుకు M.O. చేసినచో రూ. 100/- లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరముల వరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్ద లభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | |
|---|---|
| 1. కీర్తన పుస్తకం | రూ. 14.00 |
| 2. పెద్ద అచ్చు బైబిలు | 110.00 |
| 3. రిఫరెన్సు బైబిలు | 75.00 |
| 4. 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25.00 |

గమనిక : మీరు పంపు పైకము M.O. ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**
Sambamurthi Street, Ramaraopet,
KAKINADA - 533 004.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH


P.O. Box 80, KAKINADA, A.P. 533 001

Phone : 0884-73722

Editor : J.C. CHOATE

Managing Editor : JOSHUA GOOTAM


Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 ఆగష్టు 1995 సంచిక 1


## సంపాదకీయం

### నాయకునిగా యుండుటకు కాంక్షించుట

### (Desire to be a Leader)

వివిధ సంస్థలవలె సంఘమునకు కూడ నాయకులు అవసరం. అనేక వేల ప్రజలు వస్తు పోతూ యుండవచ్చును. గాని వారిని సరియైన మార్గములో నడిపించు నాయకులు అవసరం. అట్టి నాయకత్వం లేనిచో వారు దుర్మార్గులవుతారు.

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడు. అయితే స్థానిక సంఘముల రీతిలో క్రీస్తు సంఘము సమకూడి యున్నది. మరియు స్థానిక సంఘాల్లో వందలాది సభ్యులుంటారు గనుక ప్రతి స్థానిక సంఘములోను నాయకులు అవసరం. స్థానిక సంఘానికి కూడ శిరస్సు క్రీస్తే. ఆయన తన వాక్యమైన బైబిలుద్వారా ఆత్మీయముగా సంఘమును

నడిపించును. అయితే దైనందిన సంఘ కార్యక్రమాలలో నిర్ణయాలను గైకొను నాయకుల అవసరత యున్నది గదా! దీని సంగతి యేమిటి ?

ఆదిలో అపొస్తలులు సర్వలోకానికి సువార్త ప్రకటించడమే గాకుండా, సువార్తకు లోబడిన వారిందరు అపొస్తలుల బోధలో నిలిచి యుండాలని హెచ్చరింపబడింది (మార్కు 16:15, 16). అయితే అపొస్తలులు మాత్రమే సమస్త పనులు జరిగించలేరు. వారు అన్ని చోట్ల ఒకే సమయమందుండలేరు. గనుక వారు ఏర్పరచుకొన్న కొందరు పురుషులమీద చేతులుంచి, అద్భుతములు వగయిరా వారు కూడా చేయగల్గునట్లు పరిశుద్ధాత్ముడు అపొస్తలులకు అధికారము ననుగ్రహించెను. ఈ రీతిగా అపొస్తలులు, అపొస్తలులు చేతులుంచిన వారు ఆదిమ సంఘమును విశ్వాసములో బలపర్చారు.

క్రీస్తు సంఘము దినదినము పలుప్రాంతములలో అభివృద్ధి జెందుటవలన ప్రతి స్థానిక సంఘములో పెద్దలు, పరిచారకులు నియమింపబడాలని అపొస్తలులు నిర్దేశించారు (1 తిమోతి 3; తీతు 1). స్థానిక సంఘములో నియంతృత్వం ఏర్పడకుండునట్లు ఇద్దరు లేక అంతకంటె ఎక్కువ మంది పెద్దలు నియమింపబడాలని చెప్పబడింది. పెద్దలు పరిచారకులుగా నియమింపబడుటకు అర్హతగలవారు లభ్యమయ్యేవరకు స్థానిక సంఘ వ్యవహారాలను దానిలోని పురుషులు చక్కబెట్టవలెను.

అపొస్తలులు నేడు మన మధ్య జీవించుటలేదు. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినవారుగాని, అపొస్తలులు చేతులుంచిన వారుగాని మనమధ్య నేడు లేరు. అందువలన ప్రతివాడు తగిన అర్హతలను సంపాదించుకొనుటకు సాధారణ రీతిగా ఆత్మీయ విషయాల్లో పెరుగవలసినదే. ప్రతి స్థానిక సంఘము పెద్దలు పరిచారకులు కలిగియుండుట

అత్యవసరమే అయినను, ఆయా స్థానముల నలంకరించుటకు అర్హత గలవారు లేనంతకాలము సంఘములోని పురుషుల వలన అది నడిపింపబడుట శ్రేయస్కరము. అనర్హులైన పురుషులను పెద్దలు పరిచారకులుగా నియమించుటకంటే, సంఘములోని పురుషులే సంఘ కార్య కలాపములను చక్కబెట్టుట మంచిది. 1 తిమోతి 3లోను, తీతు 1లోను లిఖింపబడిన అర్హతలను క్రైస్తవు లందరు కలిగియుండుటకు కోరుకొనవలెను. కొంతకాల మయ్యేసరికి స్థానిక సంఘములో అర్హతగల పురుషులు లభ్యమగుదురు. ఆలాగే స్త్రీలు కూడ స్త్రీలకు, పిల్లలకు బోధించుటకు అర్హతగలవారుగా తయారగుదురు.

పురుషులను ఉద్దేశిస్తు అపొ.పౌలు, "ఎవడైనను అధ్యక్షపదవిని ఆశించినయెడల అట్టివాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడని" చెప్పాడు. అంటే సంఘ పెద్దలలో ఒకనిగా పనిచేయుట మంచి పని యని అతడు చెప్పుచున్నాడు. అట్టి పనిని మనం అపేక్షించని యెడల, ఆ బాధ్యతను ఎన్నడు స్వీకరించకూడదు. మనుష్యులవలన మెప్పు, ఘనత పొందాలనే కాంక్షతో ఎవడు సంఘ పెద్ద కాకూడదు. సరిగదా ఆ పదవి పరిచర్యను గొప్ప బాధ్యతను సూచించుచున్నది. సంఘ నాయకునిగా యుండగోరువాడు ప్రజలతో పనిచేయాలి, ఆత్మలను ప్రేమించాలి, వారి రక్షణకొరకు పాటుపడాలి.

స్థానిక సంఘ నాయకులు సంఘ పెద్దలు. వారు మందను కాయాలి, ఆత్మీయముగా పోషించాలి, వారికి మాదిరిగా యుండాలి, క్రమశిక్షణ నమలుపర్చాలి, బలహీనులను పునరుద్ధరించాలి. వారు సత్యము ప్రకటింపబడునట్లును, అసత్యము ఖండింపబడునట్లును, సంఘము దేవుని పనిని కొనసాగించగల్గునట్లును పర్యవేక్షించాలి. ఈ రకమైన నాయకులున్నప్పుడు సంఘము బలపడతాది, అభివృద్ధి జెందుతాది, ముందుకు కొనసాగుతాది.

ప్రతి స్థానిక సంఘములోను పెద్దలుండుట అవసరం. సంఘములో పెద్దలు పరిచారకులు తయారగునట్లు పురుషులకు నాయకత్వపు తరగతులు నిర్వహించబడాలి. ప్రపంచమందంతటా యున్న స్థానిక క్రీస్తు సంఘాలకొరకు యిది దేవుని సంకల్పము. మానవకల్పిత ఏ పద్ధతికంటెను దేవుని పద్ధతి శ్రేష్టమైనది. వాక్యములో పెరుగు. స్థానిక సంఘములో నియంతగా గాక నాయకునిగా యుండుటకు కాంక్షించు. అది దొడ్డపని.

—o—

కొండమీద ప్రసంగము-15

## హృదయములో కామము
## (Lust in the Heart)
### (మత్తయి 5 : 27-30)

యేసుప్రభువు కొండమీద చేసిన ప్రసంగములో ఇట్లు బోధించారు: "వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా? నేను మీతో చెప్పునదేమనగా-ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును. నీ కుడికన్ను అభ్యంతరపరచిన యెడల దాని పెరికి నీయొద్దనుండి పారవేయుము. నీ దేహమంతయు నరకములోకి పడవేయబడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరముగదా. నీ కుడిచెయ్యి నిన్ను అభ్యంతరపరచిన యెడల దాని నరికి నీయొద్దనుండి పారవేయుము; నీ దేహమంతయు నరకములో పడకుండ నీ అవయవములలో ఒకటి నశించుట నీకు ప్రయోజనకరముగదా" (మత్తయి 5:27-30).

యేసుప్రభువు కాలమునాటి ప్రజలు శాస్త్రులయొక్కయు పరిసయ్యుల యొక్కయు బోధద్వారా ధర్మశాస్త్రము నెరిగియుండిరి.

అయితే పెద్దల పారంపర్యాచారముతో దేవుని వాక్యమును మిళితము చేసి వారు బోధిస్తూ దేవుని వాక్యమును నిరర్థకము చేయుచు వచ్చిరి. అందువలన మరల క్రీస్తుద్వారా దేవుడే మాట్లాడవలసి వచ్చెను. వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా. నేను మీతో చెప్పునదేమనగా అని ప్రభువు తన క్రొత్తనిబంధన మార్గమును ప్రజలకు ఉపదేశించెను. ఈ క్రొత్త మార్గములో బాహ్య క్రియను అరికట్టుటగాక, హృదయ తలంపులను అరికట్టుట జరుగవలెను. వ్యభిచార విషయములో కూడ యిదే జరుగవలెను. యేసుక్రీస్తు ప్రకారము ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసినవాడగును.

దేవుడు హృదయాన్ని పరిశీలిస్తాడు. మానవుడైతే పై వేషాన్నే చూస్తాడు గాని దేవుడట్లు కాదు. దావీదును రాజుగా అభిషేకించుటకు సమూయేలు వెళ్లగా అక్కడ ఏలీయాబును చూచి నిజముగా యెహోవా అభిషేకించువాడితడే యని సమూయేలు అనుకొన్నాడు. "అయితే యెహోవా సమూయేలుతో ఈలాగు సెలవిచ్చెను: అతని రూపమును, అతని యెత్తును లక్ష్యపెట్టకుము, మనుష్యులు లక్ష్యపెట్టు వాటిని యెహోవా లక్ష్యపెట్టడు. మనుష్యులు పై రూపమును లక్ష్య పెట్టుదురు, గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1 సమూయేలు 16 : 7).

## హృదయ పరికరములు

మన జ్ఞానేంద్రియములు హృదయముయొక్క పరికరములు మాత్రమే. ఒక స్త్రీని మోహపు చూపుతో చూచేవాడు తన కళ్లతో చూస్తాడు గాని, హృదయంలో మోహిస్తాడు. యోసేపు పోతీఫరు యింటిలో యున్నపుడు అతని భార్య యోసేపు రూపవంతుడును, సుందరుడనై యుండుట చూచెను. ఆమె అతనిమీద కన్ను వేసి తనతో

శయనించుమని చెప్పెను (ఆది 39:7). సమ్సోను దెలీలా అను వేశ్య స్త్రీని చూచి మోహించెను (న్యాయా 16:1, 4). దావీదు రాజు తన రాజభవనముమీద నడుచుచు పైనుండి స్నానము చేయుచున్న ఊరియా భార్యను చూచి ఆమెను మోహించెను. ఆ సందర్భము లన్నిటిలోను మోహపు చూపుతో చూసినవారు తమ కళ్లనే పరికర ములుగా వాడుకొనిరి. అంతరంగిక హృదయ దుష్టత్వానికి తమ కండ్లను సాధనములుగా వాడుకొనిరి. "వ్యభిచారిణిని చూచి ఆశించుచు పాపము మానలేని కన్నులు గలవారుందురని" అపో. పేతురు 2 పేతురు 2 : 14 లో హెచ్చరించుచున్నాడు. అందువలన భక్తుడైన యోబు ఈలాగు అనుచున్నాడు: "నేను నా కన్నులతో నిబంధన చేసి కొంటిని. కన్యకను నేనేలాగు చూచుదును? ఆలాగు చేసినయెడల పరముననున్న దేవుని ఆజ్ఞ యేమగును? ఉన్నత స్థలముననున్న సర్వశక్తుని స్వాస్థ్యమేమగును?" (యోబు 31 : 1). దావీదు తన కళ్లతో పాపము చేసినను, మారుమనస్సు పొంది "వ్యర్థమైన వాటిని చూడకుండ నా కన్నులు త్రిప్పివేయుము" అని దేవుని ప్రార్థించాడు (కీర్తన 119:37).

మానవుడు తన కన్నులతో చూచి మోహించినా, తన హృదయమందు వ్యభిచారము చేసినవాడగును అని యేసుప్రభువు చెప్పారు. గనుక బాహ్యశుద్ధికి ముందు హృదయము శుద్ధిచేయబడాలి. ఏలయనగా "దురాలోచనలు నరహత్యలు వ్యభిచారములు వేశ్యా గమనములు దొంగతనములు ,అబద్ధ సాక్ష్యములు దేవదూషణలు హృదయములోనుండియే వచ్చును" (మత్తయి 15:19). ఇద్దరు వ్యక్తుల మధ్య చట్టవిరుద్ధమైన లైంగిక సంబంధాన్ని వ్యభిచారం అంటారు. దీనినే జారత్వమనికూడా మనం చెప్పుకోవచ్చును. పరిసయ్యులు కేవలం శారీరకంగా జరిగే వ్యభిచార క్రియనుగూర్చి పట్టించుకొనే

వారు. "వేషధారులైన శాస్త్రులారా, పరిసయ్యులారా, మీరు గిన్నెయు పళ్లెమును వెలుపల శుద్ధి చేయుదురు గాని అవి లోపల దోపుతోను, అజితేంద్రియత్వముతోను నిండియున్నవి. గుడ్డి పరిసయ్యులారా, గిన్నెయు పళ్లెమును వెలుపట శుద్ధియగునట్లుగా ముందు వాటి లోపల శుద్ధిచేయుడి" అని ప్రభువు హెచ్చరించారు (మత్తయి 23 : 25-26). ప్రభువు అంతరంగిక శుద్ధిని గూర్చి నొక్కి చెప్పారు. "నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును. కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము" (సామె 4:23). అందువలన హృదయశుద్ధి గలవారు మాత్రమే దేవునితో సహవాసము కలిగియుంటారు. "హృదయశుద్ధిగలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు" (మత్తయి 5:8).

## పవిత్ర హృదయం

దేవుడెల్లప్పుడు పవిత్రహృదయాన్నే కోరాడు, గాని మానవుడు తన శరీరేచ్ఛల వలన దేవుని చట్టాన్ని ఉల్లంఘించుచు వచ్చాడు. "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నామనవి వినకపోవును" (కీర్తన 66:18). పరిపూర్ణత, పరిశుద్ధత, పవిత్రత అనునవి దేవుడు కోరు పరిమాణములు గనుక మీ పరలోకపు తండ్రి పరిపూర్ణుడై యున్న ప్రకారము మీరును పరిపూర్ణులుగా యుండుడి అని ప్రభువు చెప్పారు (మత్తయి 5:48). "ఆయనయందు ఈ నిరీక్షణ పెట్టుకొనిన ప్రతివాడును ఆయన పవిత్రుడై యున్నట్టుగా తన్ను పవిత్రునిగా చేసికొనును" (1 యోహాను 3:3). యిది దేవునియొక్క తత్వము. దానిని మానవుడు మార్చ లేడు. ఆయన చిత్తానికి లోబడుచు మానవుడే మారాలి.

పోతీఫరు భార్య యోసేపును చూచి మోహించినందున యోసేపు నిర్దోషియైనను అనేక శ్రమలు పడవలసివచ్చినది. దావీదు

మహారాజు దేవుని హృదయ సంబంధియే అయినను అతడు బత్షెబను చూచి, మోహించి, ఆమెతో శయనించి, చివరకు ఆమె భర్తనుకూడ యుద్ధములో చంపించాడు. అతడు అంత గొప్పవాడైనను పాపము అతని మోసగించింది. అతడు దానిలో పడ్డాడు.

కామము లేక మోహపుచూపు మనలను ఎల్లవేళలా శోధించును. "ప్రతివాడును తన స్వకీయమైన దురాశ చేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును" అని యాకోబు వ్రాయుచున్నాడు (యాకోబు 1 : 14). దావీదు మహారాజు శోధననుండి పారిపోలేదు. అతడు దానికి లొంగినవాడై పాపము చేసాడు. మనము పాపముతో చెలగాటము లాడరాదు. "నిబ్బరమైన బుద్ధిగలవారై మెలకువగా యుండుడి; మీ విరోధియైన అపవాది గర్జించు సింహామువలె ఎవని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1 పేతు 5:8).

## కాపాడుకొను విధానం

అయితే పాపపు తలంపులనుండి మన హృదయాన్ని కాపాడుకొనుట ఎట్లు? మొదటిగా నీ హృదయమును భద్రముగా యుంచుకొనుము (సామె 4:23). క్రైస్తవుడు తన హృదయాన్ని గూర్చి ఎల్లవేళలా జాగ్రత్తగా యుండాలి, మెలకువకలిగి యుండాలి. పౌలు చెప్పుచున్న మాటలను వినదము: "మేము శరీరధారులమై నడుచుకొనుచున్నను శరీర ప్రకారము యుద్ధము చేయము. మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావు గాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయజాలినంత బలముకలనై యున్నవి. మేము వితర్కములను దేవునిగూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకు లోబడునట్లు చెరపట్టి యుంచుటకు సిద్ధపడి యున్నాము" (2 కొరింథీ 10:3-6).

తరువాత అంధకార క్రియలను మనము ఖండించాలి. ప్రభువు కేది ప్రీతికరమో దానిని పరీక్షించుచు వెలుగు సంబంధులవలె నడుచు కొనాలి. నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారై యుండక వాటిని ఖండించాలి (ఎఫెసీ 5:10-11). చెడ్డవాని నసహ్యించుకొని మంచిదానిని హత్తుకొనాలి (రోమా 12:9).

దేవుడు వ్యభిచారులను తప్పక శిక్షిస్తాడు. "అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోస పోకుడి, జారులైనను విగ్రహారాధకులైనను, వ్యభిచారులైనను, త్రాగు బోతులైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" (1 కొరింథీ 6:9-10). శారీరక, మానసిక, ఆత్మీయ వ్యభిచారమునుండి మనము దూరముగా పారిపోవాలి. మనం యేమి చూచుచున్నామో దాన్ని గూర్చి జాగ్రత్త కలిగియుండాలి. మోషే ధర్మశాస్త్రముకంటే క్రీస్తు చట్టము అతి సున్నితమైనది, శ్రేష్టమైనది. అది క్రియకు శిక్ష విధిస్తే యిది తలంపుకే శిక్ష విధించుచున్నది.

క్రీస్తును వెంబడించుదాం, అతి శ్రేష్టమైన మోక్షంలో ప్రవే శించుదాం.

—జాషువా గూటం

—o—

# స్వాతంత్ర్యము
## ( Freedom )

ఈ లోకంలో రకరకాల బానిసత్వాలున్నాయి. అలాగే స్వాతంత్ర్యము కూడ రకరకాలుగా యున్నది. దేవుని పరిశుద్ధ గ్రంథ మైన బైబిలు మనకు కలిగిన కొన్ని ప్రాముఖ్యమైన స్వాతంత్ర్యము లనుగూర్చి బోధించుచున్నది. వాటిలో కొన్నిటిని ఈరోజు గమ నించుదాం.

మొదటిగా, మోషే ధర్మశాస్త్రము నుండి మనకు కలిగిన

స్వాతంత్ర్యాన్ని గూర్చి బైబిలు బోధించుచున్నది. మొదటి శతాబ్దంలో కొందరు క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రానికి కొంతైనా లోబడాలని ప్రయత్నింపజూచారు. క్రీస్తు పుట్టుక 1500 సంవత్సరములకు ముందు మోషే ద్వారా దేవుడు తన ప్రజల కిచ్చిన ధర్మశాస్త్రము అది. క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రాన్ని కూడా ఆచరించాలని కొందరు అబద్ధ బోధకులు ప్రయత్నించుచుండగా, అపొ. పౌలు మోషే ధర్మశాస్త్రానికి మీరు తిరిగి వెళ్ళవద్దని క్రైస్తవులను హెచ్చరించాడు. "ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి క్రీస్తు మనలను స్వతంత్రులనుగా జేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి" యని అతడు గలతి 5:1లో వ్రాసాడు.

## ధర్మశాస్త్రము నుండి

పాతనిబంధనలో భాగమైన మోషే ధర్మశాస్త్రము కేవలం యూదులకు మాత్రమే ఇయ్యబడెను. క్రీస్తు సిలువలో "దేవుడు వ్రాతరూపకమైన ఆజ్ఞలవలన మనమీద ఋణముగాను మనకు విరోధముగాను నుండిన పత్రమును మేకులతో సిలువకు కొట్టి దానిమీద చేవ్రాతను తుడిచివేసి మనకు అడ్డము లేకుండా దానిని ఎత్తివేసెను" (కొలస్స 2:15). "కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము" (గలతీ 3:24, 25).

పాతనిబంధన నూటికి నూరుపాళ్లు దేవుని వాక్యమే. అయితే అది నేటి క్రైస్తవులకు ఒక చట్టమువలె వర్తించదు. యేసుక్రీస్తు పాత నిబంధనకు బదులు ఒక క్రొత్త నిబంధనను, క్రొత్త చట్టమును తన ప్రజల కిచ్చియున్నాడు. "ఈ హేతువుచేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధములనుండి విమోచనము కలుగుటకై ఆయన

మరణము పొందినందున, పిలువబడినవారు నిత్యమైన స్వాస్థ్యమును పొందు నిమిత్తము ఆయన క్రొత్తనిబంధనకు మధ్యవర్తియై యున్నాడు. మరణశాసన మెక్కడ ఉండునో అక్కడ మరణ శాసనము వ్రాసిన వాడు మరణము పొందితేనే అది చెల్లును; అది వ్రాసినవాడు జీవించు చుండగా అది ఎప్పుడైనా చెల్లునా?" (హెబ్రీ 9 : 15-17). క్రీస్తు సిలువమీద చనిపోయినందున ఆయన వ్రాసి యిచ్చిన క్రొత్త నిబంధన ప్రకారం క్రైస్తవులు నేడు నడుచుకోవలెను. అందువలననే అది స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణ నియమమని పిలువబడినది (యాకోబు 1:25).

## పాపము నుండి

రెండవదిగా, మనకు పాపమునుండి కలిగిన స్వాతంత్ర్యాన్ని గూర్చి, విమోచనను గూర్చి మనకు బైబిలు తెలియజేయుచున్నది. రోమాలోని క్రైస్తవులకు వ్రాస్తూ పౌలు, "మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింప బడితిరో దానికి హృదయపూర్వకముగా లోబడినవారై పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి...అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము. దాని అంతము నిత్యజీవము" అని అతడు తెలియజేసాడు (రోమా 6:17, 18, 22).

మంచి చెడుగుల విచక్షణ జ్ఞానము గల ప్రతివాడు పాపము చేసినవాడే. ఏలయనగా అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని దేవుని వాక్యము చెప్పుచున్నది (రోమా 3:23). యేసు ఏ అపరాధమును చేయలేదు. అయినను మన పాపములకు కలుగు శిక్షను ఆయన భరించాడు. పాపమువలన వచ్చు

జీతము మరణమైతే, దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసు నందు నిత్యజీవము (రోమా 6:23).

ఒక పాపి క్రీస్తు సువార్తకు లోబడినప్పుడు క్రీస్తు మరణము యొక్క ఫలాన్ని అంటే రక్షణను పొందుతాడు. రోమాలోని ప్రజలు సువార్తయొక్క ఉపదేశక్రమమునకు లోబడినందున పాపములనుండి విమోచింపబడిరి. వారు క్రీస్తులోనికి, ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందుటద్వారా, బాప్తిస్మముద్వారా ఆయనతో కూడ పాతిపెట్టబడినందున సువార్తకు లోబడిరి. పాపియైన మానవుడు సువార్తను విని, విశ్వసించి తన పాపముల విషయమై మారుమనస్సు పొంది యేసే దేవుని కుమారుడని తన నోటితో ఒప్పుకొని పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు అతడు తన గత పాపముల నుండి విముక్తి పొందును (మార్కు 16 : 16-17; అపో.కా. 17 : 30; 8:36-39; 2:38; 22:16). పాపముల అపరాధమునుండి యేసు స్వాతంత్ర్యము నిచ్చును. నిత్య శిక్షనుండి తప్పించును.

## మరణ భయమునుండి

తరువాత మరణ భయమునుండి మనము పొందే స్వాతంత్ర్యమును గూర్చి బైబిలు బోధించుచున్నది. దేవుని పిల్లలమైన మనము రక్తమాంసములు గలవారమైనందున "ఆ ప్రకారమే మరణము యొక్క బలము గల వానిని, అనగా అపవాదిని మరణముద్వారా నశింపజేయుటకును, జీవితకాలమంతా మరణ భయముచేత దాస్యమునకు లోబడినవారిని విడిపించుటకును ఆయనకూడ రక్తమాంసములలో పాలివాడాయెను" (హెబ్రీ 2:15). నమ్మకముగాయున్న క్రైస్తవునికి మరణభయము లేదు. అందుకే "నామట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభమని" అపో. పౌలు చెప్పుచున్నాడు (ఫిలి 1:21).

క్రైస్తవులు మరణమునుండి స్వాతంత్ర్యము పొందినవారు. ఈ లోకము నిలిచియున్నంత కాలము ప్రతివాడు తప్పక మరణిస్తాడు. "మనుష్యులొకసారే మృతి పొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). అయితే క్రీస్తు సువార్తకు లోబడి మరణ పర్యంతము నమ్మకముగా జీవించినవాడు మరణములో నుండి జీవమునకు దాటి వెళ్లును. "యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించిన వారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. . .ఆర్భాటము తోను ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆమీదట సజీవులమై నిలిచియుండు మనము వారితో కూడ ప్రభువును ఎదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతో కూడ ఉందుము" (1 థెస్స 4:14-17).

మానవుడు ఎన్నో వాగ్దానాలు చేయవచ్చును గాని నెరవేర్చ లేకపోవును. అయితే దేవుని "కుమారుడు మిమ్ములను స్వతంత్రులుగా చేసినయెడల మీరు నిజముగా స్వతంత్రులై యుందురు" (యోహా. 8:36). — రోయస్ ఫ్రెడరిక్ (IGT)

— o —

## క్రీస్తు రక్తము ఏమి చేయును?

1. క్రీస్తు రక్తము - పాప పరిహార రక్తము :— క్రీస్తు యేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను (రోమా 3:25). "ఆయనే మన పాపములకు శాంతి కరమై యున్నాడు" (1 యోహాను 2:2; 4:10).

2. విమోచన క్రియ ధనము :- "అలాగే మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రియధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని" చెప్పెను. మత్తయి 20:28; అపొ.కా. 20:28. "దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది" (ఎఫెసీ 1 : 7; కొలస్స 1 : 14; 1 పేతురు 1:19; తీతు 2 : 11-14; 1 కొరింథి 1 : 30-31; రోమా 3:23; ప్రకటన 5:9; హెబ్రీ 9:15).

3. పాపములు తుడిచివేయు రక్తము :-మీ కొరకు నియమించిన క్రీస్తు యేసును ఆయన పంపునట్లును మీ పాపములు తుడిచి వేయబడు నిమిత్తమును మారుమనస్సు పొంది తిరుగుడి (అపొ.కా. 3.20; హెబ్రీ 9:22).

4. సమాధానపరచు రక్తము :-కాబట్టి విశ్వాసమూలముగా మనము నీతిమంతులముగా తీర్చబడి మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమా 5 : 1; రోమా 5:10; 2 కొరింథి 5:18; ఎఫెసీ 2:13). క్రీస్తు మన మధ్యవర్తి.

5. రక్షించు రక్తము: కాబట్టి ఆయన రక్తముద్వారా ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఉగ్రతనుండి రక్షించబడుదుము (రోమా 5 : 8-9; ఎఫెసీ 5:25-27; అపొ.కా. 13:38; 2 తిమోతి 2:10).

6. నీతిమంతులముగా తీర్చు రక్తము:- కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఉగ్రతనుండి రక్షింపబడుదుము (రోమా 5:9). దేవుని ఆత్మయందు

మీారు కడుగబడి పరిశుద్ధ పరచబడినవారై నీతిమంతులుగా తీర్చ బడిరి (1 కొరింధి 6:11).

7. పవిత్రపరచు రక్తము :- ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి సత్ క్రియల యందాసక్తిగల ప్రజలను తన కోసరమై పవిత్రపరచుకొని తన స్వాత్త్తగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను (తీతు 2:14). అటువలె క్రీస్తుకూడ సంఘ మును ప్రేమించి అది కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను మహిమగల సంఘము గాను ఆయన తన యెదుట నిలువబెట్టుకొనవలెనని వాక్యముతో ఉదక స్నానముచేత దాని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను (ఎఫెసీ 5:27).

8. క్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘము :- దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు మీామట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి అపొ.కా. 20:28.

9. క్రొత్తనిబంధన రక్తము :- ఇది నా రక్తము అనగా పాప క్షమాపణ నిమిత్తము అనేకులకొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము. ఆయన పాత్ర ఎత్తుకొని-ఈపాత్ర నా రక్తము వలననైన క్రొత్తనిబంధన. మీారు దీనిలోనిది త్రాగునప్పుడెల్లా నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని చెప్పెను (1 కొరింధి 11:25).

యేసుక్రీస్తు రక్తము ఇది నా రక్తము, అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకులకొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము అని చెప్పెను (మత్తయి 26:28). క్రీస్తు రక్తము ఏమిచేయను అనే విషయ

మును ఈ పాఠములో చూచితిమి. ఇప్పుడు ఎప్పుడు, ఎక్కడ, ఏలాగున క్రీస్తు రక్తము పాపరోగిని కలసికొని పాపమునుండి రక్షించును?

యేసుక్రీస్తువారు పునరుత్థానుడైన తరువాత ఆయన పరలోకమునకు వెళ్లిపోకముందు శిష్యులకు ఈలాగు ఆజ్ఞాపించెను: "మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మనివానికి శిక్ష విధింపబడును"(మార్కు 16:15-16).

సువార్త అనగానేమి? పౌలు చెప్పినది- "నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని. అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతి పొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథి 15:3-4). సువార్త అనగా క్రీస్తు మరణము-సమాధి-పునరుత్థానము. పౌలు రోమా క్రైస్తవులకు వ్రాయుచూ రోమా 6:1-6లో బాప్తీస్మమునుగూర్చి వివరించుచూ రోమా 6:17లో ఈలాగు చెప్పుచున్నాడు: మీరు పాపమునకు దాసులై యుండిరి గాని ఏ ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో దానికి హృదయపూర్వకముగా లోబడినవారై నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము. "నమ్మి బాప్తీస్మము పొందినవాడు రక్షించబడును" (మార్కు 16:16) నమ్మనివానికి శిక్షవిధింపబడును. ఒకడు బాప్తీస్మము పొందునప్పుడు క్రీస్తు మరణ, సమాధి, పునరుత్థానములో పాలు పొందును, రక్షింపబడును.

—పి. ప్రకాశం, జగన్నాధగిరి.

# వెయ్యేండ్ల పాలన ఎక్కడిది — మానవునిదా? దేవునిదా?

**Premillenialism, from Man or God?)**

క్రీస్తు శకము మొదటి శతాబ్దములో రాజ్యమును స్థాపించుటకు దేవుడు సంకల్పించాడు (దాని. 2:44). ఆ రాజ్యాన్ని స్థాపించడానికి క్రీస్తు మొదటి శతాబ్దములో వచ్చాడు (మార్కు 9 : 1). "నీవు రాజువా?" అని పిలాతు యేసు నడిగాడు. యేసు "నీవన్నట్టు నేను రాజునే, సత్యమునుగూర్చి సాక్ష్య మిచ్చుటకు నేను పుట్టితిని, ఇందు నిమిత్తమే యీ లోకమునకు వచ్చితిని" అని చెప్పాడు (యోహాను 18:37). ఆయన ఏమి చేయడానికి వచ్చాడో దాన్ని సాధించాడు. దేవునికి ప్రార్థిస్తూ "చేయుటకు నీవు నా కిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చితినని" ఆయన పలికాడు (యోహాను 17:4). ఎవరైనా దేవుని రాజ్యము స్థాపించబడిందనే వాస్తవాన్ని అంగీకరించడానికిది చాలును. అయినను రాజ్యము భావిలో ఎప్పుడో స్థాపించబడునని ఎదురు చూచేవారున్నారు! వారు వెయ్యేండ్ల పాలనవాదులు. అయితే క్రీస్తు భూమిమీద వెయ్యేండ్ల మట్టుకు పాలన చేయునని చెప్పే లేఖనభాగ మేమీ లేదని గ్రహించుకోవాలి. రాజ్యము స్థాపింపబడక ముందు రెండు ప్రాముఖ్య సంగతులు జరుగునని వెయ్యేండ్ల పాలనావాదులు ఎదురు చూచుచున్నారు; అవి ఎత్తబడుట **(Rapture)** మరియు మహాశ్రమల కాలము **(The Great Tribulation)**.

## వెయ్యేండ్ల పాలనావాదులు చెప్పే ఎత్తబడుట

క్రీస్తు ఒక్కసారి కాదుగాని రెండుసార్లు తిరిగి వస్తాడని వెయ్యేండ్ల వాదులు చెప్తారు. వీరి బోధ ప్రకారము ఆయన మొదట వచ్చినప్పుడు మృతులైనట్టియు, సజీవులైనట్టియు తన అనుచరులను రహస్యముగా కొనిపోవుటకు ఆయన వచ్చును. ఇదే 'ఎత్తబడుట'

అని వారు చెబుతారు. ఇలాగ రహస్యముగా ఎత్తబడినవారు తీర్పు తీర్చబడి తమ ఫలములను పొందుతారు. మరి ఏడు సంవత్సరముల మట్టుకు వారు ప్రభువుతో పరలోకములో ఉంటారు.

## ఎ త్త బ డు ట

లేఖనాల్లో 'ఎత్తబడుట' (Rapture) అనే మాటగాని దాని బోధగాని ఏమీ లేదు. సరికదా క్రీస్తు మరలా వచ్చునప్పుడు ప్రతి నేత్రము ఆయనను చూచునని బోధించుచున్నవి (ప్రకటన 1 : 7). మరియు ఆయన గొప్ప ఆర్భాటముతో, అగ్ని జ్వాలలతో, బూరధ్వనితో వచ్చునని అవి బోధించుచున్నవి (2 పేతురు 3:10; 1 థెస్స 4: 16; 17, 2 థెస్స 1:7-10). అంతేకాకుండా క్రీస్తు ఇంకా ఒకే ఒక్కసారి మాత్రమే తిరిగి వచ్చునని లేఖనములు బోధించుచున్నవి (హెబ్రీ 9:28). అప్పుడు నీతిమంతులు, దుర్మార్గులు కూడా తీర్పు తీర్చబడి తమ క్రియలను బట్టి ప్రతిఫలమును పొందుదురు (2 కొరింథి 5 : 10; ప్రకటన 22:12). మరల గురుగులను గూర్చి క్రీస్తు చెప్పిన ఉపమానము ప్రకారము దుర్మార్గులకు శిక్ష విధింపబడక ముందు నీతిమంతులు ప్రత్యేకముగా తీర్పు తీర్చబడుటకు రహస్యముగా కొనిపోబడరు (మత్త 13:24-43). అట్టి అబద్ధ బోధకు దేవుని వాక్యములో సమయం, స్థానం ఇయ్యబడ లేదు.

## మహాశ్రమల కాలము

పరిశుద్ధులు పైకెత్తబడిన తరువాత, ఏడు సంవత్సరముల మట్టుకు "మహాశ్రమల కాలము" సంభవించునని పెరుస్యేంట్ల పాలనా వారు వాదిస్తారు. పైకెత్తబడగా భూమిమీద మిగిలిపోయినవారు అంతకంతకు ఎక్కువయిన శ్రమలను ఎదుర్కొంటారు. ఈ ఏడు సంవత్సరాలలోను (ఎత్తబడియున్న కారణమువలన భూమిమీద క్రీస్తుగాని, పరిశుద్ధాత్ముడుగాని, రక్షింపబడిన వారెవరుగాని లేకపోయినను)

ప్రజలు ఎలాగో ఒకలాగున యేసుక్రీస్తువైపు మార్పు చెందుతారు. ఈ ఏడు సంవత్సరముల శ్రమలకాలపు మధ్యలో మహాశ్రమ కాలము ఆరంభమగును. అంత్య క్రీస్తు దర్శనమిస్తాడు. అప్పుడు ఇశ్రాయేలీయులు అతనితో నిబంధన చేసుకుంటారు. క్రొత్త పరిశుద్ధులు హాత మార్చబడతారు. పరిస్థితి అంతా పాడై పోతాది. చివరిగా, మానవ జాతి నాశనము గావించబడక ముందు, క్రీస్తు తన రాజ్యమును స్థాపించుటకు మరింకొకసారి దర్శనమిస్తాడు. పైకెత్తబడుటను గూర్చిన యట్లే ఈ మహాశ్రమ కాలమునుగూర్చి కూడా వెయ్యేండ్ల పాలనా వాదులు పొరబడ్డారు.

క్రొత్తనిబంధనలో యేసుగాని, అపొస్తలులుగాని శ్రమను గూర్చి కనీసం ఇరవైసార్లు పలికారు. శ్రమ అంటే నమ్మకమైన క్రైస్తవులకు కలిగే బాధలు, శోధనలు, హింసలని వారి ఉద్దేశము. యేసు ఇట్లన్నాడు: "దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడని నేను మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి. లోకులు నన్ను హింసించిన యెడల మిమ్మునుకూడ హింసింతురు" (యోహాను 15:20). "మీ సహోదరుడును, యేసును బట్టి కలుగు శ్రమలలోను రాజ్యములోను, సహవాసములోను పాలివాడునైన యోహానను నేను" అని యోహాను తన్నుగూర్చి చెప్పుకున్నాడు (ప్రకటన 1:9). "అనేక శ్రమలు అనుభవించి మనము దేవుని రాజ్యములో ప్రవేశింపవలెనని" అపో. కార్యములు 14:22 బయలుపరచుచున్నది. అట్టి శ్రమలలో పాలివారై యున్నట్టుగా మనము మహా ఆనందముతో సంతోషించాలి (1 పేతురు 4:13). ఏలయనగా పరలోకమందు మన ఫలము అధికమగును (మత్తయి 5:10-12). ప్రభువు వచ్చువరకు ఈ లోకము అంతమయ్యే వరకు శ్రమలు కలుగుచునే ఉంటాయి.

## ముగింపు

క్రీస్తు విధించిన రక్షణ మరతుల నంగీకరింపని వానికి రెండవ తరుణం (Second Chance) అంటూ ఏమీ ఉండదు. క్రీస్తు మరల వచ్చినప్పుడు అంతము సంభవించును. అయితే క్రీస్తు మరల ఎప్పుడు వచ్చుచున్నాడు? దేవునికి తప్ప మరెవనికి తెలియదు (మత్త 24:36). "అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును, పంచభూతములు మిక్కుటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములు కాలిపోవును" (2 పేతురు 3 : 10). యేసుక్రీస్తు మరల తప్పక వచ్చుచున్నాడు, గాని వార్యేంద్రుల్ల పాలనావాదుల కార్య క్రమము ప్రకారము కాదు. "ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము" (2 కొరింధి 6 ; 2). ప్రభువు ఎప్పుడు వచ్చునో ఎవనికి తెలియదు గనుక మెలకువగావుండి ప్రార్థన చేయుడి (మత్తయి 24:42, మార్కు 13:13).

నీవు ఇప్పుడు ఆయన రాజ్య నివాసుడవా? ఆయన రాకడకొరకు సిద్ధపడి యున్నావా ? — మాంటీ మెక్ నైర్.

—o—

## భయపడకుము

### (Fear Not)

మానవ జీవితమును అధికముగా నాశనముచేయు వాటిలో భయమొకటి. ఇది అందరూ గుర్తించిన ఉద్వేగములలో ఒకటి మాత్రమే. భయమువలన కొన్ని సమయములలో మనస్సునకు భయంకరమైన ఆపద సంభవించును. భయము చాలా శక్తివంతమైన ఒక ఉద్వేగము. ఇది భౌతిక శరీరమును పాడుచేయుటయే గాక మెదడును శక్తిహీనముగా చేయును.

ప్రతి ఒక్కరూ భయమును కల్గియుందురు. భౌతికమైన, మానసికమైన, ఆర్థికపరమైన, మరియు సాంఘికపరమైన భయము కల్గియుందురు. గతించిన కాలమునుగూర్చిన చింత రాబోవు భవిష్యత్ ను గూర్చిన భయము కల్గియుందురు. మానవుడు కల్గియున్న అన్ని భయములకు బైబిలు సమాధాన మిచ్చుచున్నది.

"అబ్రాహామా, భయపడకుము; నేను నీకు కేడెము; నీ బహుమానము అత్యధికమగునని చెప్పెను" (ఆది 15:1).

"భయపడకుడి, యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి" (నిర్గమ 14:13).

"మీ హృదయములు జంకనియ్యకుడి, భయపడకుడి, వణకకుడి" (ద్వితీ 20 : 3).

"నేను యెహోవా యొద్ద విచారణ చేయగా ఆయన నాకుత్తరమిచ్చెను. నాకు కలిగిన భయము లన్నిటిలోనుండి ఆయన నన్ను తప్పించెను" (కీర్తన 34 : 4).

"మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమునుకూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" (మత్తయి 10:28).

"ధైర్యము తెచ్చుకొనుడి; నేనే, భయపడకుడని" యేసు చెప్పెను (మార్కు 6 : 50). "చిన్న మందా భయపడకుడి, మీకు రాజ్యము అనుగ్రహించుటకు మీ తండ్రికి ఇష్టమై యున్నది" (లూకా 12 : 32).

దేవుడు మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహముగల ఆత్మనే ఇచ్చెను గాని పిరికితనముగల ఆత్మ నియ్యలేదు (2 తిమో. 1 : 7). ప్రేమలో భయముండదు; అంతేకాదు, పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్ళగొట్టును (1 యోహాను 4:18).

భయపడకుడి లేక దీనికి సమానమైన పదము బైబిలునందు 365 సార్లు తెలియజేయబడినది. సంవత్సరములో ఏ ఒక్క రోజు మనము భయపడవలసిన అవసరము లేదు. భయమునుండి మనలను స్వతంత్రులనుగా దేవుడు చేయునని సువార్త చెప్పుచున్నది. దేవుడు చెప్పినదానిని మనము విని, చదివి విశ్వసించి వాక్యమునకు లోబడుట ద్వారా విమోచన పొందగలము.

దేవుని కృపద్వారానే అంటే దేవుని వాక్యముద్వారానే మనము భయమునుండి విడుదల నొందగలము. నీవు వాక్యము విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మము ద్వారా ఆయన సంఘము అనగా క్రీస్తు సంఘములో ఉండి భయపడకుము.

—బిల్ డిల్లాన్, U.S A.

— o —

## ఏలీ కుమారుల నుండి పాఠములు

## (Lessons from The Sons of Eli)

ఏలీ పదిహేనుమంది న్యాయాధిపతులలో పద్నాల్గవవాడు. 1 సమూయేలు రెండు, మూడు అధ్యాయములు ఏలీ కుమారులయొక్క స్వభావమును మనకు తెలియపరచుచున్నవి. ఈ కుమారులనుగూర్చి ఈ విధముగా చెప్పబడినది: "బెలియాలు కుమారులు" (పనికిమాలిన వారు). ఎందుచేత ఈ కుమారులు పనికిమాలినవారైరి ? వారి హేయమైన క్రియలయొక్క ప్రతిఫలమేమి? అనునది తెలిసికొనుటకు మూడు ముఖ్యమైన కారణములు చెప్పబడినవి.

1. ఏలీ కుమారులు ప్రభువును ఎరిగిన వారు కారు (1 సమూ. 2 : 12). ఎవడైనను ఆయన చిత్తము చొప్పున చేయ నిశ్చయించుకొనిన ఎడల ఆ బోధ దేవునివలన కలిగినదో లేక నాయంతట నేనే బోధించుచున్నానో వాడు తెలిసికొనును (యోహాను 7:17). పిల్లలకు

నేర్పే బాధ్యత తల్లిదండ్రులది. "బాలుడు నడువ వలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడు దానినుండి తొలగిపోడు" (సామెత 22:6). ఒకడు సత్యమును తెలిసికొనక పోయినట్లయితే అతడు ఏవిధముగా స్వతంత్రుడగును? (యోహాను 8 : 31, 32). ఏలీ కుమారులు దేవుని నెరుగక పోవుటవలన వారు ఘోరమైన పాపములు చేసిరి.

2. ఏలీ కుమారులు దేవునియొక్క బలి అర్పణను అలక్ష్యము చేసిరి (1 సమూ. 2:13-17). బైబిలు లోని మరికొందరు కూడా దేవుని అలక్ష్యముగా ఆరాధించిరి. వారు కయీను (ఆది. కా. 4), నాదాబు, అబీహు. ఎవడైనను దేవుని లేక ఆయన చిత్తమును తెలిసికొనకపోయినప్పుడు అతడు తన ఇష్టానుసారముగా ప్రవర్తించును (న్యాయా17:6).

3. ఏలీ కుమారులు దుర్నీతిపరులు (1 సమూ 2:22). వారు ఇంద్రియ నిగ్రహము లేనివారని స్పష్టమగుచున్నది. వారు కామాంధులై ఇష్టానుసారముగా నడచుకొనుచు దుర్మార్గులైరి. విగ్రహారాధనలో పాల్గొన్న మహాదుర్నీతిపరులని కొందరు విశ్వసింతురు. వీరు పది ఆజ్ఞలను పూర్తిగా విస్మరించినట్లు స్పష్టమగుచున్నది. నేటి మన ప్రపంచము దూరదర్శన్, సినిమాలు, పత్రికలయందలి బూతు చిత్రములు, సంగీతము, మన శరీరములను దైవములుగా ఎంచుట, మన సంతోషములకు అధిక ప్రాధాన్యత కలుగ చేయుట అను దుర్నీతికి ప్రభావితమై యున్నది. పౌలు చెప్పినదేమనగా "మోసపోకుడి. దుష్ట సాంగత్యము మంచి నడవడిని చెరుపును" (1 కొరింథి 15:33).

ఏలీ కుమారులు నీచమైన కార్యము చేయుటకు ఒక కారణము కలదు. "తన కుమారులు తమ్మును తాము శాపగ్రస్తులుగా చేసికొనుచున్నారని తానెరిగియు వారిని అడ్డగించలేదు" (1 సమూ 3 : 13). పిల్లలను అన్ని విషయములలోను సరిగా పెంచుట అనగా వారిని అదుపు చేయుట అనునది తల్లిదండ్రుల ముఖ్యమైన బాధ్యతయైయున్నది. వారు

కోరిన ప్రతీదానిని చేయలేరు మరియు కోరిన ప్రతీ దానిని కలిగియుండలేరు. మన పిల్లలను దేవుని యందలి భయభక్తులతో పెంచకపోయినట్లయితే (ఎఫెసీ 6:4), మనము మన కుమారులను దేవునికంటె గొప్ప చేయువారమగుదుము (1 సమూ 2:29). అనగా దేవుని యెడల అవిధేయత గల వారమని అర్థము.

తల్లిదండ్రులు పిల్లలను అదుపుచేయుట అత్యంత అవసరమైయున్నది. చెడుగుచేయవలెననెడి బలమైన కోరిక గలదు (యిర్మీయా 17;9). ఆ కోరిక అనేక దుర్మార్గముల వలన, అనేక శోధనల వలన ప్రోత్సహించబడు చున్నది. తల్లిదండ్రుల అదుపు అనునది తప్పనిసరియైనది. అది మన పిల్లలయెడల మాత్రమే గాక, దేవునిపట్లకూడ మన కర్తవ్యమై యున్నది (ద్వితీ 6:3-9; 21:18-21; సామెతలు 19:18, 23:13-14, 29:15-16, 22-6; ఎఫె 6:4). తల్లిదండ్రుల అదుపు లోపించినట్లయిన అది పిల్లలకు, తల్లిదండ్రులకు, దేశమునకు నాశనకరము (1 సమూ 4:11, 18, 22).

తల్లిదండ్రులమైన మనము మన పిల్లలను అదుపులో యుంచుటకు సాధకము చేయుదము. మరియు పిల్లలు అణకువ కల్గి తల్లిదండ్రులను సరియగు రీతిలో గౌరవించులాగున అభ్యసింప చేయుదము. ఏ తల్లిదండ్రులైతే తమ బిడ్డలను దేవుని యందలి భయభక్తులతో పెంచుదురో ఆ తల్లిదండ్రులు తమ తల్లిని మరియు తండ్రిని గౌరవించు బిడ్డలను కలిగి యుంటారు. — M. పీటర్సన్ (VOT).

—o—

తెలుగు, ఇంగ్లీషు, ఒరియా భాషలలో ఉచిత బైబిలు కరస్పాండెన్సు
కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి :
**Director, Bible Correspondence Course**
**P. O. Box 80, KAKINADA-533 001.**

— సంక్షిప్త వార్తలు —

# భారతదేశపు క్రీస్తు పనిలో క్రొత్త మలుపు

1963వ సంవత్సరములో సహో. జె.సి. బెయిలీగారు ప్రథమముగా భారతదేశం వచ్చి ఆనాటి అస్సాం రాష్ట్ర ముఖ్యపట్టణమైన షిల్లాంగ్‌లో అప్పటికే ఖాసీ కొండజాతులవారి మధ్యనున్న స్థానిక క్రీస్తు సంఘములో పనిచేయ నారంభించిరి గాని కొద్ది మాసముల లోనే వారు మద్రాసుకు వచ్చి దక్షిణ భారతదేశములో పని ప్రారంభించారు. అప్పటికి మన దేశంలో యున్న స్థానిక క్రీస్తు సంఘములు రెండే రెండు. అవి షిల్లాంగులోనే యుండెవి.

సహో. జాషువా గూటం మరియు నెహెమ్యా గూటంగార్లు బెయిలీగారి ద్వారా సత్యసువార్తను విని సువార్తకు లోబడినవారిలో ప్రప్రథములు. 1964 మొదట్లో ఈ యిద్దరి అన్నదమ్ములు క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది బెయిలీగారితో అటు తమిళనాడులోను, ఇటు ఆంధ్రలోను క్రీస్తు సంఘములు స్థాపించుటకు ప్రయాసపడిరి. ఇప్పటికీ ఆ ప్రయాసలో నిమగ్నులైయున్నారు. బెయిలీగారు మొదట్లో ఆర్థికపరమైన అనేక యిబ్బందులకు గురియైనను వెనుదిరుగక బలముగానే ముందుకు సాగిపోవుచు ఆంధ్రలో పెక్కుచోట్ల క్రీస్తుసంఘములు స్థాపించి, సువార్తికులను, అనాథలను పోషించుటకు సంకల్పించారు.

ఈ గొప్ప పనిలో వారికి చేయూత నిచ్చుటకుగాను అమెరికా లోని రేటవున్ క్రీస్తు సంఘము ముందుకు వచ్చారు. వారు గత 25 సంవత్సరములనుండి ఇండియాలో క్రీస్తు పనిని పర్యవేక్షించుచు సమర్థవంతముగా నడిపించుచు వచ్చిరి. దరిమిలా అనేకమంది అమెరికా సోదరులు మనదేశం రావడం వారుకూడ సువార్త పనిలో నిమగ్నులవడం పలుప్రాంతాలను వ్యక్తులను ఉన్నత దశకు తీసికొనిరావడం మనం ఎరిగినదే. బెయిలీగారి పరిచర్యవలనను, రేటవున్ సంఘ పర్యవేక్షణ వలనను, చార్ల్స్ స్కాట్‌గారి ఆసక్తివలనను ఇప్పుడు క్రీస్తు సంఘములు భారతదేశంలోని అన్ని రాష్ట్రములలోను ఇనుమడించుచు నెలకొని యున్నవి. అందువలన దేవునికి స్తోత్రము.

అయితే 1995 ఆగష్టు నెల నుండి రేటవున్ సంఘము భారత దేశపు పనినుండి పూర్తిగా విరమించుకొనుచున్నారు. బెయిలీగారికి యిప్పుడు 92 సం॥లు, మరియు చార్ల్స్ స్కాట్‌గారికి 78 ఏండ్లు; అయినా వారు గత 10 సంవత్సరముల నుండి ఇండియాకు వచ్చుట లేదు. ఈ రకమైన ఇబ్బందుల వలన రేటవున్ సంఘ పెద్దలు ఈ బాధ్యతను వేరొక సంఘమునకు అప్పగించ నెంచుకొన్నారు. జె. బి. టోరిటర్‌గారి నాయకత్వమున ఇంతవరకు వారు ఈ గొప్ప పనిని కొనసాగించినందుకు వారికి మా హృదయపూర్వక వందనములు. రేటవున్ సంఘము భారతదేశపు పనినుండి విరమించుకొనుచున్నందున ఇదొక సువర్ణ యుగాంతముగా అగుపడుచున్నను, అంతకంటె శ్రేష్ఠమైన సహాయ సహకారాలను, ప్రోత్సాహమును యిచ్చు సోదరులను దేవుడు మనకందించబోవుచున్నాడు. దానికొరకై ప్రార్థింతము, నిరీక్షింతము. బెయిలీగారు, స్కాట్‌గారు, టోరిటర్‌గారు, రేటవున్ సంఘ పెద్దలు భారతదేశములో మొదలిడిన క్రీస్తు పని దినము అభివృద్ధి జెందుచు క్రీస్తు వచ్చువరకు నిలకడగా యుండునట్లు ప్రార్థింతము, కృషి చేయుదము.

—జాషువా గూటం.

Regd. No. R/KD—45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
S A T Y A W A K K U
P.O. Box 80
KAKINADA 533 001

No.

To